
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
3
ములుగు
బుధవారం 12 జూన్ 2024



మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్ రూరల్, జూన్ 11 : మేడిగడ్డ బ్యారేజీలో న్యూఢిల్లీకి చెందిన సీఎస్ఎంఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారానికి ఏడో రోజుకు చేరాయి. బ్లాక్-7లో 20గేటు కటింగ్ పనులు పూర్తికాగా గేటు భాగాలను తొలగించేదుకు వీలుగా అప్రోచ్ రోడ్ పనులు కొనసాగుతున్నాయి. పిల్లర్ల కిందున్న అగాధాన్ని పూడ్చేందుకు చేపట్టిన ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులు, షీట్‌ఫైల్స్ అమరిక, సీసీ బ్లాకుల రీఆరెంజ్‌మెంట్ పనులు నడుస్తున్నాయి. బుధవారం బ్లాక్-7లోని 18,19గేట్లు ఎత్తేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

చక్కబడిందా..?

భూపాలపల్లిలో నిధులు మంజూరైనా అభివృద్ధి నోచుకోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



- నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం
- విద్యార్థులకు అందుబాటులోకి రాని సౌకర్యాలు
- 40 శాతం పాఠశాలల్లో ఆగిపోయిన అభివృద్ధి
- 420 అమ్మ ఆదర్శ స్కూళ్లలో పనులు షురూ

భూపాలపల్లిటౌన్, జూన్ 11: బడి గంటలు మోగాయి. బుధవారం నుంచి ప్రభుత్వ పాఠశాలు పునఃప్రారం భమవుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తంగా 420 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 20,710 మంది విద్యార్థులు చవువుతున్నారు. మరో 30 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైంది. 20 నుంచి 30 పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు ఆంగ్ల మాద్యమం ప్రారంభం కాకపోగా మిగతా అన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు పూర్తి స్థాయిలో ఆంగ్ల మాధ్య మ తరగతులను నిర్వహిస్తున్నారు. పలు పాఠశాలల్లో డిజిటల్ తరగతులు కొనసాగనున్నాయి. ఇటీవల ప్రభు త్వం మారిన నేపథ్యంలో పాఠశాలల్లో పనిచేస్తున్న బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మొదలైంది. దీంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడనుంది. మరోవైపు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా. ప్రభుత్వ పాఠశా లల పరిస్థితిలో మార్పులేదు. గత ప్రభుత్వం మన ఊరు- మన బడి పథకం ప్రవేశపెట్టి అభివృద్ధి పనులు చేపట్టింది. కానీ అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయలేదనే వాదనలున్నాయి. దీంతో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణపనులు సైతం పూర్తికాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో అభివృద్ధి పనులు చేపట్టింది. ఈ పనుల్లో చాలా వరకు అంతంత మాత్రంగానే పూర్తయ్యాయి. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు.

40 శాతం పాఠశాలల్లో ఆగిపోయిన పనులు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య అందిస్తామన్న పాలకుల హామీ నీటిమూటలే అయ్యిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మన ఊరు - మనబడి పథకం కింద జిల్లాలో మొదటి విడతగా 149 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. 49 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 90 పాఠశాలల్లో పనులు 50శాతం నుంచి 70శాతం వరకు పూర్తి కాగా మిగిలిన ఎనిమిది పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. టేకుమట్ల మండలకేంద్రంలోని ఎంపీపీఎస్‌లో పనులు ఏమాత్రం ప్రారంభం కాలేదు.



భూపాలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

కేటాయించిన నిధులు రూ.32.15 కోట్లు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద పనులు చేపట్టేందుకు రూ.18.96కోట్లు కేటాయించారు. పాఠశాలల అభివృద్ధి కమిటీలకు రూ.13.19 కోట్లు కేటాయించారు. మొత్తం రూ.32.15 కోట్లలో మంజూరైంది మాత్రం తక్కువేనని అధికారులు చెబుతున్నారు. పాఠశాలల అభివృద్ధి కమిటీలకు కేటాయించిన నిధులు రూ.13.19కోట్లలో ఇంకా 1.46కోట్లు పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రెండేళ్లలో పూర్తయింది 49 పాఠశాలల్లోనే..

మన ఊరు.. మన బడి కార్యక్రమం 2021 డిసెంబరులో ప్రారంభమైంది. నేటి వరకు పాఠశాలల అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలోని 420 పాఠశాలల్లో 149 పాఠశాలలను ఎంపిక చేసిన అధికారులు రెండేళ్ల కాలంలో 49 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేయగలిగారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు కాంట్రాక్టర్లు అంటున్నారు. అప్పులు తీసుకొచ్చి పనులు చేసినప్పటికీ తమకు ఇంకా బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా జిల్లాలో 100 పాఠశాలల్లో పనులు పూర్తికావాల్సి ఉంది.

420 అమ్మ ఆదర్శ పాఠశాలలు.. రూ.14కోట్లు

జిల్లాలో మొత్తంగా 450 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 420 పాఠశాలల్లో తరగతులు జరుగుతున్నాయి. మరో 30 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో అవి మూసివేత దశలో ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయులు బడిబాట ద్వారా విద్యార్థులను బడికి తీసుకొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 450 పాఠశాలల్లో 430 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా, మిగతా వాటిలో 6 ఆదర్శ పాఠశాలలు, 11 కస్తూర్బా గాంధీ పాఠశాలలు, డీఎన్‌టీ పాఠశాలలలు రెండు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఒకటి ఉన్నాయి. వీటి అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.14కోట్లు వెచ్చించగా అందులో మొదటి విడతగా 25శాతం అంటే.. 3.50కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 406 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్లలో మిగిలిపోయిన పనులు, తాగునీరు, విద్యుద్దీకరణ, కొత్త టాయిలెట్స్ పనులు జరుగుతున్నాయి.



గంట మోగిన వేళ



కొత్తగా రంగులద్దుకున్న వెంకటాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

- నేటి నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం
- పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం
- 256పాఠశాలల్లో పునరుద్ధరణ పనుల పూర్తి
- ఖాళీగా 192 ఉపాధ్యాయ పోస్టులు

ములుగు కలెక్టరేట్, జూన్ 11: వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తెరుచుకోనున్నాయి. జూన్ 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతోంది. ఈక్రమంలో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మౌలిక సౌకర్యాల కల్పన, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీపై దృష్టి సారించారు. బడిబాట కార్యక్రమం ఊరూరా జరుగుతోంది. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

జిల్లాలో 552 పాఠశాలలు

ములుగు జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలో 552 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 372 ప్రాథమిక, 68 ప్రాథమికోన్నత, 112 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత విద్యాసంవత్సరంలో 14,348 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేటు ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, కేజీబీవీలు, సంక్షేమ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు కలిపి మొత్తంగా 43,658 మంది అడ్మిషన్‌లు పొందారు. ఈసారి విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని అధికారులు ముమ్మరం చేశారు. ఈనెల 19 వరకు కార్యక్రమం కొనసాగుతుండగా లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేస్తున్నారు.

పూర్తికాని పాఠశాలల పునరుద్ధరణ పనులు

గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మనబడి కార్యక్రమంలో 367 పాఠశాలలను ఎంపిక చేసింది. మౌలిక

» మిగతా 6వ పేజీలో...



వాజేడు మండలం జగన్నాథపురం యూపీఎస్‌లో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణం

పాము కాటుకు విద్యార్థిని మృతి

మంగపేట, జూన్ 11: పాము కాటుకు గురై విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాల శివారు బండిరేవుకు చెందిన లెంకల స్వరూప, సమ్మయ్య కుమార్తె రాణి (14) ఎనిమిదో తరగతి చదువుతోంది. వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి పది రోజుల క్రితం మంగపేట మండలంలోని కమలాపురం వచ్చింది. వారం రోజుల అనంతరం పెదదనాన్న రామకృష్ణ ఇంటికి దేవనగరం వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మంచంపై కూర్చొని కాళ్ల కింద పెట్టి మాట్లాడుతుండగా పాము కాటేసింది. ఈ విషయాన్ని రాణి ఆ ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. అందరితో కలిసి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమెను రాజుపేటలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగానే రాణి మృతి చెందింది.

కరెంట్ బిల్లుల్లో డిజిటల్ చెల్లింపులు పెరిగాయి

- ఆన్‌లైన్ పేమెంట్లకు వినియోగదారుల ఆసక్తి
- క్యూఆర్‌కోడ్ పద్ధతిని ములుగు జిల్లాలో అమలు చేస్తాం
- టీజీఎస్పీడీసీఎల్ భూపాలపల్లి సర్కిల్ ఎస్ఈ మల్సూర్ నాయక్

ములుగు, జూన్ 11: విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు వినియోదారులు ఆసక్తి చూపుతున్నారని, ములుగు జిల్లాలో ప్రతినెలా డిజిటల్ చెల్లింపుల పురోగతి కనిపిస్తోందని టీజీఎస్పీడీసీఎల్ భూపాలపల్లి సర్కిల్ ఎస్ఈ మల్సూర్‌నాయక్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మే నెలలో రూ.కోటి6లక్షల 64 వేలకుపైగా బిల్లు లను వినియోగదారులు ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లించారని, ప్రతినెలా 20శాతం వృద్ధి కనిపిస్తోందని వెల్లడించారు. భవిష్యత్తులో డిజిట ల్ పేమెంట్లు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇంటి నుంచే కేవలం రెండు నిమిషాల్లోనే పేమెంట్ చేసే అవకాశాన్ని వినియోగదారులు విరివిగా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. నెలనెలా అందించే బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించి దానిని స్కాన్ చేయడం ద్వారా వినియోగించిన విద్యుత్, చెల్లించాల్సిన బిల్లు వివరాలను తెలుసుకోవడం, అనంతరం చెల్లింపులు చేసే సాంకేతికతను త్వరలో ములుగు జిల్లాలో అందుబాటులోకి తెస్తామని, ప్రస్తుతం వరంగల్‌లోని మట్టెవాడలో ప్రయోగాత్మకంగా అమలవుతూ మంచి ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. సెల్ఫ్ రీడింగ్‌పై కూడా అవగాహన కల్పి స్తామని వివరించారు.

తునికాకు బోనస్ చెల్లించాలని ధర్నా

మంగపేట, జూన్, 11: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ కూలీలు ఫారెస్ట్ రేంజ్ కార్యలయం వద్ద సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. అనంతరం కార్యాలయం ఇన్‌చార్జి ఓంప్రకాశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ములుగు జిల్లా కమిటి సభ్యుడు నర్రా శివప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి జాగటి చిన్నా మాట్లాడుతూ మండలంలోని పూరేడుపల్లి, శాంతినగర్, పోశమ్మగూడెం, శ్రీరామ్‌నగర్, దోమేడ తదితర గ్రామాల్లోని కూలీలకు 2016 నుంచి 2023 సంవత్సరం వరకు బోనస్ విడుదల చేస్తామని రాష్ట్ర సీసీఎఫ్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఇంకా చెల్లించలేదని విమర్శించారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ షకీల్‌పాషాను అడిగితే తాము డబ్బులు పంపించామని చెబుతున్నారని, కానీ ఎవరి అకౌంట్‌లలో జమ కాలేదని అన్నారు. అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యన్ని వీడి తునికాకు కూలీలకు పెండింగ్ బోనస్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు మంగయ్య, సోమయ్య, కొప్పుల మాణిక్యం, జిగట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఆగం చేస్తావా?

- సివిల్ సప్లయీస్ అధికారిపై ఎమ్మెల్యే ఆగ్రహం
- విత్తనాల సక్రమంగా సరఫరా చేయకపోవడం పట్ల వ్యసాయ శాఖ అధికారిపై మండిపాటు
- రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరిక
- గరంగరంగా భూపాలపల్లి జడ్పీ సమావేశం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 11: అధికారుల తీరుపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఆగం చేస్తావా..? అంటూ సివిల్ సప్లయ్ అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. స్థానిక మునిసిపల్ కార్యాయలయ సమావేశ మందిరంలో మంగళవారం జరగ్గా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. అధికారుల తీరుపై ఆయన గరం అయ్యారు. ముఖ్యంగా సివిల్ సప్లయ్ డీఎం రాఘవేంద్రపై నిప్పులు చెరిగారు. మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఆగం చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. తరుగు పేరుతో మిల్లర్లు ధాన్యాన్ని క్వింటాకు 4 నుంచి 6 కిలోలు కోత పెడుతున్నా ఏం చేస్తున్నారు.. చర్యలు ఎందుకు తీసుకోలేదు? అని నిలదీశారు. మిల్లర్లు కోత పెడుతున్న విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లారా..? అంటూ ప్రశ్నించారు. దీనిపై డీఎం సమాధానం ఇస్తూ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని నీళ్లు నమిలారు. ఏడేళ్లుగా ఇక్కడే తిష్ట వేసి రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడు, ఇతర మిల్లర్లతో మిలాకాతై రైతులను దోచుకుంటున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ఇక నుంచి ఆ పరిస్థితి రాకుండా జిల్లాలోని అన్ని మిల్లులపై విజిలెన్స్ తనిఖీలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరానని అన్నారు. త్వరలోనే ఆ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. పలువురు జడ్పీటీసీ సభ్యులు కల్పించుకొని మిల్లర్ల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమేనని, దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.



సివిల్ సప్లయీస్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

విత్తనాలు ఎన్ని వచ్చాయి?

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్‌తో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకు ఎన్ని విత్తనాలు వచ్చాయో చెప్పాలని అడిగారు. దీంతో ఆయన తడబడటంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. 3వేల పాకెట్ల సోమనాథ్ విత్తనాలను ప్రత్యేకంగా మంజూరు చేయించానన్నారు. అవి ఎవరికి ఇచ్చావో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లాకు ఇప్పటి వరకు కేవలం 500 ప్యాకెట్లే వచ్చాయని, వాటిని కాటారంలోని లావణ్య ఫర్టిలైజర్‌కు 180, భూపాలపల్లిలోని సాయిరాం ఫర్టిలైజర్‌కు 320 ప్యాకెట్లు ఇచ్చామని వ్యవసాయ శాఖ అధికారి చెప్పారు. దీంతో ఎమ్మెల్యే కల్పించుకొని ఒకటి రెండు షాపులకు సరఫరా చేయడమేమిటని మండిపడ్డారు. మిగిలిన విత్తనాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులంతా ఖరీఫ్‌కు సిద్ధమతున్నారని, వారికి కావాల్సిన విత్తనాలను అందబాటులో ఉంచాలని అన్నారు. వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే 24 గంటల్లో ఆ షాపును సీజ్ చేయించి రిమాండ్ చేయిస్తానని అన్నారు. రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇదే సమయంలో కాటారం, మల్హర్ ఎంపీపీలు సమ్మయ్య, మల్హల్‌రావు కల్పించుకొని బ్రాండెడ్ విత్తనాలు అందుబాటులో ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. కొంత మంది వ్యాపారులు బ్లాక్‌లో బ్రాండెడ్ విత్తనాలు విక్రయిస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు.

విద్యాశాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయి?

జిల్లాలో విద్యాశాఖపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండిపడ్డారు. విద్యాశాఖలో ఎక్కడెక్కడా ఎన్ని ఖాళీలు ఉన్నాయో చెప్పాలని డీఈవో రాంకుమార్‌ను ప్రశ్నించగా ఆయన సమాధానం ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అభివృద్ధికి తన నిధుల నుంచి రూ. 2.47 కోట్లు మంజూరుచేశానని, మౌలిక సౌకర్యాల కల్పించడంలో విద్యాశాఖ అధికారి విఫలమవుతున్నారన్నారని నిప్పులు చెరిగారు. ఇకనైనా ఎక్కడెక్కడ ఎన్ని ఖాళీలు ఉన్నాయో చెబితే సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రిటైర్డ్‌మెంట్‌కు దగ్గరలో ఉండటంతో పెద్దగా దృష్టి సారించలేకపోతున్నావా? అంటూ డీఈవోను ఎమ్మెల్యే నిలదీశారు.

రైతులకు మినహాయింపు ఇవ్వాలి

ఇరిగేషన్‌శాఖ సమీక్ష సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుల నుంచి మట్టి తీసుకునేందుకు

» మిగతా 6వ పేజీలో...

సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ములుగు కలెక్టరేట్, జూన్ 11: నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపితో కలిసి హైదరాబాద్ నుంచి రైతునేస్తం కార్యక్రమంపై మంత్రి మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు వ్యవసాయ శాఖ అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయరంగంలో విస్తరణ కార్యకలాపాలు బలోపేతం చేయడం కోసం రైతుల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని రెండు రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌హాళ్లను ప్రారంభించామని, ప్రతి మంగళవారం రైతువేదికలో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో పంటల మార్పిడి, పంటలకు వచ్చే చీడపీడలు, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వెరైటీ పంటలు సాగుచేసే రైతులతో, స్థానిక ఆదర్శ రైతులతో వారి అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసే కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. రైతులు వ్యవసాయసాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువుల వినియోగం వైపు దృష్టి పెట్టాలన్నారు. అధిక దిగుబడినిచ్చే పంటలకు రైతులు ప్రాధాన్యత ఇచ్చి వాటి సేద్య వివరాలు, పద్ధతులను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. వ్యవసాయ సాగు మొదటిదశలో విత్తనాల ఎంపికలో రైతులు తొందర పడకూడదని, విత్తనాల విషయంలో అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించే పంటలు ప్రపంచదేశాలను ఆకర్షించేలా ఉండాలని, సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కాలానుగుణంగా పంట మార్పిడి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, ఏవో సంతోష్, విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, వ్యవసాయ అధికారులు

PUBLIC NOTICE

It is to inform all the general in public that, my client Akula Madhavi. W/o. KranKimar, R/o.H.No.29-1-92/A Manthrapuri colony, Erragattugutta. KITS X-Road, Bheemaram, Hasanparthy Mandal of Hanamkonda District, is intending to purchase

SCHEDULE OF PROPERTY

Agriculture land to an extent of Ac.1-00 gts out of the land to an extent of Ac 0-12 gts in sy.No.626/B1/1, Ac.0-21 gts in sy.No.627/B/1/2, Ac.0-17 gts in sy.No 628/E/3/2/1 total Ac.1-10 gts,situated at Nidigonda village, Raghunathpally Mandal of Jangaon district boundaries as follows

EAST : Remaining Agriculture land of others
WEST : Agriculture land of kapa
NORTH : 200 fts NH Road towards Hanmakonda to Hyderabad
SOUTH :Agriculture land of Vatala Erra Narsaiah

from its owner Neelam Sammiah, S/o,Neelam Yakaiah, R/o.H.No.16-4-333 Rudramamba Nagar, Fort, Road, Warangal and entered into an agreement of sale dt : 18-04-2024. in this regard my client is causing this publication calling objection from general public with regard to the sale transaction, if any person is having any claim, shall inform the same within seven days from the date of this publication. otherwise my client shall proceed further transaction by treating as no objection from anybody.

Hence this publication

MAREDU SRINATH ADVOCATE.
Warangal
Cell:9291414964

విత్తన కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 11: రైతాంగానికి అవసరమయ్యే జీలుగ, పచ్చిరొట్ట తదితర విత్తనాల కుంభకోణంలో విజిలెన్స్ విచారణ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు. 1660 బస్తాలు బోగస్ పేర్లతో ఇతర రాష్ట్రాలకు తొర్రూరు వ్యవసాయాధికారి అమ్ముకుంటే విచారణ చేపట్టిన అధికారి పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా తప్పుడు నివేదిక అందించారన్నారు. సుమారు రూ.20లక్షల మేర కుంభకోణం జరిగినా ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జోక్యం చేసుకుని సమగ్ర జ్యుడీషియల్ విచారణ జరిపించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాకుండా ఇతర అధికారులను పంపించి మొక్కుబడి విచారణ వల్లే జరిగిన అవినీతి అక్రమ కుంభకోణం బయటికి రావడం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో ఆగ్రోస్ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతుంటే వ్యవసాయాధికారులు కన్నెత్తి చూడకపోవడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిందని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, పాపారావు, అనిల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హైని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులెవరూ నష్టపోకుండా పారదర్శకంగా సీనియారిటీ జాబితాలను రూపొందించి ఉపాధ్యాయుల అభ్యంతరాలను స్వీకరించాలని కోరారు. అభ్యంతరాలను సానుకూల దృక్పథంతో పరిష్కరించి పారదర్శక సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు పీఆర్టీయూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షుడు రొండ్ల భానుప్రసాద్, నాయకులు డి. మాలకొండారెడ్డి, జి. రాజు పాల్గొన్నారు.



డీఈవో అబ్దుల్ హైకి వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20లక్షలకు టోకరా

ఇద్దరిపై కేసు నమోదు

గార్ల, జూన్ 11: మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని పీక్లీ తండాకు చెందిన బోడ సంజీల్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.20 లక్షలు తీసుకున్నారని, దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. హైదరాబాద్‌కు చెందిన దాసరి రమ్య-వంశీ దంపతులు ఇంట్లో సంజీల్ అక్క భూక్యా ఉష ఏడాది కాలం నుంచి పని చేస్తోంది. ఈ క్రమంలో తమ తమ్ముడు సంజీల్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని రమ్య-వంశీలను ఉష ప్రాధేయపడింది. దీంతో కొంత డబ్బు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తాని చెప్పి దంపతులు నమ్మబలికారు. రూ.20 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023 డిసెంబర్ నుంచి నేటి వరకు విడతల వారీగా ఫోన్‌పే, అకౌంట్ ద్వారా డబ్బులు చెల్లించారు. అయినప్పటికి ఉద్యోగం చూపించకపోవడంతోరమ్య-వంశీపై సంజీల్ గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉత్తరాలను పోస్టుబాక్సులో వేస్తున్న పరికిపండ్ల అశోక్, తదితరులు

సాధారణ బోగీల కోసం సమరం

- మానుకోట నుంచి కోటి ఉత్తరాల పోరుకు శ్రీకారం
- తెలుగు రాష్ట్రాల్లో ఊపందుకున్న నినాదం
- రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలనేదే అందరి డిమాండ్
- ప్రధానికి మోదీకి చేరడమే లక్ష్యంగా ప్రారంభించిన మహబూబాబాద్ వాసి

మహబూబాబాద్ టౌన్, జూన్ 11 : ప్రతీ రైలులో రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి.. అవి సాధారణ ప్రయాణికులకు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రవేశ ద్వారాల్లో వేలాడుతూ.. అవస్థలు పడుతూ ప్రయాణిస్తుంటారు. దేశంలో ప్రతీరోజు రైళ్లలో దాదాపు 30లక్షల మంది ప్రయాణిస్తున్నారని ఓ అంచనా. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని.. అప్పుడే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, దేశ వ్యాప్తంగా రైళ్లలో సాధారణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధాని మోదీ దృష్టికి తీసుకు పోవాలన్న లక్ష్యంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ మార్చి 8న ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితిని ఏర్పాటు చేసి శ్రీకారం చుట్టిన ఈ ఉద్యమం మూడునెలల కాలంలోనే తెలుగురాష్ట్రాలకు పాకింది. మూడునెలల్లో ఆయన తెలంగాణలో 29 జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని విస్తృత పర్చారు. ఇక ఈ ఉద్యమం గురించి వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వివిధ రాష్ట్రాల ప్రజలు కూడా స్వచ్ఛందంగా మద్దతు పలుకుతూ వారు సైతం ప్రధానికి ఉత్తరాలు రాస్తున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌కు జీవనోపాధికోసం వెళ్లిన తెలుగు ప్రజలు కూడా కోటి ఉత్తరాల కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. ఇలా ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 8 లక్షల ఉత్తరాలను ప్రధానికి రాసినట్టు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు.

ఉద్యమానికి బీజం ఇలా..

మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళ్లేందుకు 2024 మార్చి 8న మానుకోట పట్టణానికి చెందిన రైళ్లలో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రాగా ఆ రైలుకు ముందు భాగంలో ఇంజన్ వెనుక ఒక జనరల్ బోగీ, వెనుక భాగంలో మరో జనరల్‌బోగీ ఉంది. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ గర్భిణి చిన్నపాపతో కోణార్క్ రైలు ఎక్కేందుకు ప్రయత్నించి, కింద పడిపోయింది. చంకలో ఉన్న పాప తలకు దెబ్బతగిలింది. వెంటనే 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆరు రోజుల తర్వాత అభంశుభం తెలియని ఆ పాప చనిపోయింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ గర్భిణికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

కొద్ది రోజుల తర్వాత గర్భంలో ఉన్నపిండం కూడా చనిపోయిందని తెలిసింది. దీం తో చలించి పోయిన పరికిపండ్ల అశోక్ ఈ తప్పు ఎవరిదీ? శిక్ష ఎవరికి? అని ఆలోచించి, సాధారణ ప్రయాణికుల బాధలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లి సరిష్కరించాలని కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కడానికి సిద్ధంగా ఉన్న సాధారణ ప్రయాణికులు (ఫైల్)

20 ఏళ్ల నుంచి రెండు సాధారణ బోగీలే..

దేశ వ్యాప్తంగా రోజురోజుకు జనాభా వృద్ధి చెంది రైలు ప్రయాణికులు పెరుగుతున్నప్పటికి రైళ్లల్లో మాత్రం జనరల్ బోగీల సంఖ్య మారడం లేదు. దాదాపు రెండు దశాబ్దాల కిందట నుంచి ఇప్పటికి ప్రతీ రైలులో రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉంటున్నాయి. నిత్యం వ్యాపార, ఉద్యోగ పనుల నిమిత్తం నిత్యం ప్రయాణించే వారి సం ఖ్య విపరీతంగా పెరుగుతూ వస్తోంది. రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండడంతో సాధారణ ప్రయాణికులు రైలు ఎక్కాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఏవో ఇబ్బందులు పడి రైలు ఎక్కినప్పటికి గమ్యస్థానం చేరేంత వరకు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రపంచంలో అతి పెద్ద రవాణావ్యవస్థగా ఉన్న భారత రైల్వేశాఖ ఈ సమస్యను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎల్లలు దాటిన కోటి ఉత్తరాల కార్యక్రమం..

ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలని మానుకోట నుంచి ఆరం భమైన ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమం ఒక్క జిల్లానే కాదు..! ఒక్క రాష్ట్రం కాదు.. ఎల్లలు దాటి దేశవ్యాప్తమైంది. సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలంగాణ రాష్ట్రంలోని 29 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 18 జిల్లాలు గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో, పాండిచ్చేరి సమీపంలోని యానంలో కూడా స్వయంగా కోటి ఉత్తరాల ఉద్యమంపై అవగాహన కల్పించారు. భారత దేశంలో 140 కోట్లకు చేరువైన జనాభాలో సుమారు ప్రతీరోజు 30 లక్షల మంది ప్రయాణికులు రైళ్ల ద్వారా ప్రయాణి స్తున్నారని, సాధారణ ప్రయాణీకుల బాధలను గుర్తించి అందరూ ప్రధానికి ఉత్తరం రాయాలని కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అన్నివర్గాల ప్రజల మద్దతు లభించడంతో ఇప్పటికే దాదాపుగా 8 లక్షల వరకు ప్రధానికి ఉత్తరాలను పంపి ఉండవచ్చని చెబుతున్నారు. ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి

డాక్టర్ పరికిపండ్ల అశోక్, రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్, మానుకోట



ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి. రైళ్లలో జనరల్ బోగీలు ఎక్కువగా లేకపోవడంతో నిత్యం ప్రయాణించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా రైలుఎక్కే సమయంలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో, కొందరు ఎక్కలేక పోతున్నారు. మరి కొంతమంది రైలు ఎక్కే సమయంలో జారి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలి.



ప్ఛ్.. చిప్స్ లేవే..!

చెట్టుపైనున్న ఓ ఉడత.. ఎవరో తినిపడేసిన చిప్స్‌ప్యాకెట్‌ను చూసింది. అందులో ఏమైనా తినడానికి దొరుకుతాయేమోనని ఆశపడింది. ఎంతో ఆత్రుతగా.. ఆశగా చెట్టుపై నుంచి దిగి వచ్చింది. ఆ ఖాళీ ప్యాకెట్‌ను అటు.. ఇటు.. కిందికి.. పైకి తిప్పి చూసింది. కానీ అందులో ఏమీ దొరక్కపోవడంతో.. చివరకు ప్యాకెట్‌కు అంటుకుని ఉన్న కాస్తంత చిప్స్ పొడిని ఆస్వాదించి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో మంగళవారం కనిపించాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

ముఖ్యమంత్రిని కలిసిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 11 : తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా నియమి తులైన మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిని కలిసిన తరువాత ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు తదితర కాంగ్రెస్ ముఖ్య నేతల ను కలిశారు. చైర్మన్‌గా నియమితులైన రవీందర్‌రావుకు అభినందనలు తెలియచేశారు. టెస్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రావు సాయంత్రం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్‌కు చేరుకున్నారు. బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ ఉద్యోగులు, సీఈవోలు తదితరులు ఆయనకు భారీ పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో మార్నేనిని సన్మానించారు. టెస్కాబ్ చైర్మన్‌గా తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా రవీందర్‌రావు పేర్కొన్నారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి

- అధిక లోడ్, అంతరాయాల నివారణకు ప్రత్యేక చర్యలు
- త్వరలో 35 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- 'ఆంధ్రజ్యోతి'తో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జూన్ 11 : ఎన్పీడీసీఎల్ పరిధిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరంతరం విద్యుత్‌ను అందించేందుకు శక్తి వంచనలేకుండా కృషిచేస్తున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో తీసుకోబోతున్న చర్యల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మానవ ప్రమేయం లేకుండా సాంకేతికను జోడించి అంతరాయాలకు సంబంధించిన సమస్యలను కార్పొరేట్ ఆఫీస్ నుంచి గుర్తించి సత్వర చర్యలు చేపట్టేలా ఆర్‌టీడీఏఎస్, ఎస్ఏడీఏను ప్రతీ సబ్‌సబ్‌స్టేషన్‌లో అమర్చబోతున్నామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు 800కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించామని, మరో 300కిలోమీటర్లకు త్వరలోనే టెండర్లకు ఆహ్వానిస్తామన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న లెంతీలైన్‌ల మధ్య అంతరాయాలు తగ్గించేందుకు ప్రతీ 5 కిలోమీటర్లకు ఒక ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్స్ (ఎఫ్‌పీఐ) ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. విద్యుత్ అంతరాయాలకు, ప్రమాదాలకు కారణమవుతున్న లూజ్ లైన్‌లను చాలా వరకు సవరించడం జరిగిందని, ఇంకా అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న లూజ్ వైర్లను సవరించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అధికలోడును తగ్గించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో త్వరలోనే 35 సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. అదే విధంగా ఎన్పీడీసీఎల్ పరిధిలో 2156 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇప్పటి వరకు 1995 లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చడం జరిగిందన్నారు. కాగా, ఉమ్మడి వరంగల్‌లో 402 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్‌లైన్‌గా మార్చడం జరిగిందన్నారు. మిగితా వాటిని మార్చేందుకు వేగంగా పనులు జరుగుతున్నట్టు వెల్లడించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

మార్కెట్‌లో వ్యాపారుల ఆందోళన

- డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటున్న ఆగ్రహం
- నిబంధనల మేరకే నడుచుకున్నామన్న అధికారులు



మార్కెట్ కార్యాలయంలో ఆందోళన నిర్వహిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు

వరంగల్ వ్యవసాయం, జూన్ 11: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు ఆందోళనకు దిగారు. పర్మిట్ బుక్కులు ఇవ్వకుండా, ఏదో ఒకసాకుతో డబ్బులు గుంజేలా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ అధికారులతో చాంబర్ ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. మంగళవారం ఉదయం కరానీ ఖరీదుదారుడికి సంబంధించిన గుమస్తా మార్కెట్ కార్యాలయంలోని సూపర్‌వైజర్ మురళీ వద్దకు వెళ్లి పర్మిట్ బుక్కులను ఇవ్వాలని కోరాడు. సూపర్‌వైజర్ 2024 కొత్త నామ్స్ ప్రకారం ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ 1 నుంచి 10 ప్రొఫార్మా కావాలని, అది ఇస్తే పర్మిట్ బుక్కులు ఇస్తానని చెప్పడంతో సదరు గుమస్తా అక్కడ జరిగిన విషయాన్ని యజమానికి వివరించాడు. కరానీ యజమానితోపాటు చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మార్కెట్ కార్యాలయానికి చేరుకుని సూపర్‌వైజర్‌తో పాటు గ్రేడ్ 2 కార్యదర్శి రాముతో వాగ్వాదానికి దిగారు. పర్మిట్ బుక్కులు ఎందుకు ఇవ్వరని, వ్యాపారుల నుంచి డబ్బులు గుంజాలని చూస్తున్నారంటూ గొడవకు దిగారు. కొత్తగా వచ్చిన నిబంధనల మేరకే ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ షీట్ అడిగామని, డబ్బులు అడగలేదని గ్రేడ్ 2 కార్యదర్శి చెప్పే ప్రయత్నం చేసేనా వారు పట్టించుకోలేదు. చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మినీ చాంబర్ కార్యాలయంలో సమావేశమయ్యారు.

జమ్మికుట మార్కెట్‌కు వెళ్లిన మార్కెట్ కార్యదర్శి

ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి మంగళవారం జమ్మికుంట మార్కెట్ వెళ్లారు. మార్కెట్లో గొడవ జరిగిన సమయంలో మార్కెట్లో లేరు. దీంతో చిన్న విషయం కాస్తా పెద్దగా తయారైంది. జమ్మికుంట మార్కెట్ కార్యదర్శిగా ఉన్న నేపథ్యంలో అక్కడ కూడా కార్యకలాపాలు ఎలా నడుస్తున్నాయో చూసేందుకు వెళ్లారు. ఏనుమాముల మార్కెట్లో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో అధికారులు మార్కెట్లో జరిగిన విషయాన్ని మార్కెట్ కార్యదర్శికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన మార్కెట్ కార్యదర్శి ఏనుమాముల మార్కెట్‌కు చేరుకున్నారు.

మార్కెట్లో చాంబర్ ప్రతినిదులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏనుమా ముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి, మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు ఏనుమాముల మార్కెట్‌కు చేరుకుని అధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

చాంబర్ ప్రతినిధులతో అధికారుల సమావేశం

మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశం, డీడీ అజ్మీరా జు, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు బొమ్మినేని రవిందర్‌రెడ్డి, మడూరి వేదప్రకాష్, అల్లె సంపత్, అలాగే కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, కరాని రాజు తదితర వ్యాపారులతో సమావేశమయ్యారు. సమస్య సద్దుమనిగేందుకు అధికారులు కృషి చేశారు. 2024 నిబంధనల మేరకు ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ ఫాం 1 టు10 ప్రొఫార్మా ప్రతీ నెల 10వ తేదీలోపు ఇవ్వాల్సి ఉండగా దానిని 20వ తారీకు వరకు ఇచ్చేందుకు చాంబర్ ప్రతినిదులు గడువు కోరారు. పర్మిట్ బుక్కులు ఇవ్వాలంటే తప్పకుండా ప్రతీనెల పీఆర్ ఇవ్వాలని, మార్కెట్ ఫీజు 10 తారీకు లోపు చెల్లించాలని అధికారులు షరతు పెట్టారు. దానికి చాంబర్ ప్రతినిధులు కూడా ఒప్పుకోవడంతో సమస్య సద్దుమనిగింది.

'విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 11 : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి నాడే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఎస్సెస్సీ ఫలితాల్లో కూడా ఉత్తమ మార్కులు సాధించిన విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రారంభానికి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, స్థానిక శాసనసభ్యులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. డీఈవో వెంట సెక్టోరియల్ అధికారి సుధాకర్, హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు రంజాన్ అలీ, వీరస్వామి ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



విజేతలకు షీల్డు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, జూన్ 11: క్రీడల్లో గెలుపోటములు సహజమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గ్రౌండ్‌లో నెల రోజులుగా నిర్వహించిన సీసీపీఎల్ జీఎస్సార్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది క్రీడలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఓటమి చెందిన క్రీడాకారులు తిరిగి గెలిచేందుకు మరింత కష్టపడాలని సూచించారు. జిల్లాలోని క్రీడాకారులకు తనవంతు సహాయం అందిస్తానన్నారు. ప్రథమ విజేత కింగ్స్ ఎలెవన్ జట్టుకు రూ. 70వేలు, ద్వితీయ బహుమతి డ్రీమ్స్ ఎలెవన్ జట్టుకు రూ. 30వేలు బహూకరించారు. ఈకార్యక్రమంలో సీసీపీఎల్ కమిటీ అధ్యక్షుడు చింతల మహేందర్, టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవీ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, నాయకులు దొడ్డి కిష్టయ్య, శ్రీనివాస్, నరేందర్, అల్లకొండ కుమార్, చింతల సుమన్ క్రీడల నిర్వహణ కమిటీ సభ్యులు పిట్టల అనిల్, సాయినితిన్, వేల్పుల రాజ్‌కుమార్, మాటూరి లవణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు చట్టం ప్రకారమే పరిహారం

భూపాలపల్లి కలెక్టరేట్: కేటికే ఓపెన్ కాస్ట్-3లో భూములు కోల్పోయిన గణపురం మండలం కొండంపల్లికి చెందిన నిర్వాసితులకు భూచట్టం ప్రకారమే పరిహారాన్ని అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ భవేష్ మిశ్రా ఓపెన్ కాస్ట్-3 భూ నిర్వాసితులతో డీఎల్ఎన్సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ భూములకు భూనిర్వాసిత చట్టం ప్రకారం పరిహారం అందేలా చర్యలు చేపడుతున్న తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం పైప్‌లైన్ పనులు ప్రారంభం



కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు

కాటారం, జూన్ 11: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం(చిన్న కాళేశ్వరం)లో భాగంగా స్టేజ్-2 పంప్ హౌస్ కింద తీసుకున్న రిజర్వాయర్ల(చెరువులు)కు గతంలో వేయకుండా మిగిలిపోయిన పైప్‌లైన్ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గారెపల్లి స్టేజ్-2 పంప్‌హౌస్ నుంచి ఆదివారంపేట, వీరాపూర్ చెరువులకు వెళ్లే పైప్‌లైన్ పెండింగ్ పనులను నిర్మాణ సంస్థ ప్రతినిధులు చేయించారు. చిన్న కాళేశ్వరంలో భాగంగా చేపట్టిన స్టేజ్-1, స్టేజ్-2 పంప్‌హౌస్‌లకు గోదావరి నీటిని ఎత్తి పోసి మొదటి విడతగా సుమారు 20వేల ఎకరాలకైనా సాగునీరు అందించాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మిషన్ భగీరథ సర్వేను పరిశీలించిన డీఎల్‌పీవో

టేకుమట్ల, జూన్ 119: మండలంలోని రామక్రిష్టాపూర్ (వి) గ్రామంలో పంచాయితీ కార్యదర్శి నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను మంగళవారం డీఎల్‌పీవో వీరభద్రయ్య పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేష్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాటారం, జూన్ 11: మండల కేంద్రంలోని కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ప్రవేశం పొందడానికి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో విడత ప్రవేశాల కోసం ఈనెల 14 వరకు గడువు పొడింపు ఉందని పేర్కొన్నారు. ఐటీఐలో ఎన్‌సీవీటీ కింద వివిధ ట్రేడ్లలో సీట్లు ఉన్నాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

రైతులకు అవగాహన

కాటారం, జూన్ 11: మండల కేంద్రంలోని కాటారం రైతువేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వానాకాలంలో వ్యవసాయ సాగు అంశాలపై అవగాహన కల్పించారు. కాటారం డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, రైతులు రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. పత్తి సాగులో విత్తనాల ఎంపిక, సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులను వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వివరించారు. అన్ని కంపెనీల బీజీ-2 విత్తనాలు ఒకే రకంగా ఉంటాయని, రైతు లు అనవసరంగా బ్లాక్‌లో కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు రామకృష్ణ, ప్రభావతి, సతీష్, సుధాకర్, మహేష్, ఏఈవోలు రాజన్న, సరిత, శరత్, దీపక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేటీకే-1వ గని కార్మికులకు కౌన్సెలింగ్

కాకతీయఖని, జూన్ 11: గడిచిన ఐదు నెలల్లో 80 మస్టర్లకన్న తక్కువ చేసిన కార్మికులకు కేటీకే-1వ గని మేనేజర్ వెంకట్రావు మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్మికుల కుటుంబ సభ్యులను పిలిపించి విధులకు హాజరు కాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు క్రమం తప్పకండా విధులకు హాజరయ్యేలా కుటుంబ సభ్యులు చూడాలని సూచించారు. సింగరేణి సంస్థ కార్మికుల కోసం, వారి కుటుంబాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టిం దన్నారు. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలంటే కార్మికులు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాధన్, రూప్‌సింగ్, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ బండి శ్రీనివాస్ యాదవ్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి

గోవిందరావుపేట, జూన్ 11: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో జవహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చల్వాయి గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన జయశంకర్ బడిబాట గ్రామసభ జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయడం జరుగుతుందని అన్నారు. చల్వాయి ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోర్డులతో విద్యాబోధనను అత్యంత ప్రతిభ గల ఉపాధ్యాయులు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అర్థమయ్యేరీతిలో చెప్పడానికి డిజిటల్ టీవీ సౌకర్యం ఉందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు చంద్రారెడ్డి, వాసుదేవరెడ్డి, నాగేశ్వర్‌రావు, సాంబయ్య, వేణుగోపాల్, వెంకటలక్ష్మి, శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

- తాడ్వాయి : బీరెల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాల్లో గల ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని బీరెల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బీరెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన బడిబాట గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు ప్రవేశపెడుతుందని, ఇందులో భాగంగా ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాంతోపాటు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని రంగాపూర్, వీరాపూర్, ఆశన్నగూడ ఎల్లాపూర్, కామారం, బీరెల్లి, అంకంపల్లి, తదితర గ్రామాల్లోని విద్యార్థులను స్థానిక పాఠశాలల్లో చేర్పించాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

మంగపేట, జూన్ 11: మండలంలోని గోదావరి తీరం వద్ద ఇసుక క్వారీలను మంగళవారం అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మంగళవారం తనిఖీలు చేశారు. పొద్మూరు పట్టా క్వారీని, చుంచుపల్లి గిరిజన సొసైటీలకు చెందిన 3, 4 క్వారీలను, రాజుపేట గిరిజన సొసైటీ, కత్తిగూడెం పట్టాల్యాండ్, కత్తిగూడెం గిరిజన సొసైటీ క్వారీలను సందర్శించారు. అదనపు కలెక్టర్ క్వారీలను తనిఖీలు చేయడానికి వస్తున్నారని తెలుసుకున్న యజమానులు ముందు జాగ్రత్తగా ఇసుక లారీల ఆన్‌లైన్‌ను రద్దుచేయడంతో లారీలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అదనపు జిల్లా కలెక్టర్ ఇసుక క్వారీల పనితీరును, ప్రాంతాలను మాత్రమే పరిశిలించి వెళ్లారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ బైరి వీరస్వామి, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, టీఎస్‌ఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్ తారక్‌నాథ్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ ఎస్కే. సఫియా తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న సాంబయ్య, మిత్ర బృందం

మేడారం, జూన్ 11: ముంబై ఐఐటీలో ప్రవేశం పొందిన తాడ్వాయి మండలం నార్లాపూర్‌కు చెందిన పేద విద్యార్థిని సంకే పల్లవికి హనుమకొండ మాజీ జడ్పీటీసీ, మాజీ కార్పొరేటర్ కోరబోయిన సాంబయ్య మంగళవారం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. విద్యార్థుల్లో అనేక మంది ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు నోచుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి విద్యార్థులకు సాయం అందించేందుకు తాను, తన మిత్రబృందం సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబన్న సేవా బృందం సభ్యులు మెట్టు నర్సింగరావు, మందాటి రవీందర్, అనుముల సినాసాగర్, అన్నారపు రవీందర్‌రెడ్డి, ఒక్కి రాజు, గంగధరి మల్లేష్, కాంగ్రెస్ తాడ్వాయి మండలం అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం ఉత్సవ కమిటీ చైర్మన్ అరెం లచ్చు పటేల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎర్రబెల్లి మనోజ్ అనే దాత పల్లవికి రూ. 50వేలు సాయం అందజేశారు.

గంజాయి పట్టివేత

మంథని (పెద్దపల్లి జిల్లా), జూన్ 11: గంజాయిని క్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంథని బస్ డిపో వద్ద ఎస్సై వెంకటకృష్ణ, సీపీలు దుబ్బాసి రమేష్, ఐతు లుకా పెట్రోలింగ్ చేస్తుండగా ప్లాస్టిక్ బ్యాగ్‌తో అనుమానాస్పదంగా ఉన్న యువకులను అదుపులోకి తీసుకొని సోదా చేయగా ఒక కిలో 70 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.26,750 ఉంటుందని సీఐ తెలిపారు. యువకులను విచారించగా పోలీసులు విచారించగా మంథనికి చెందని పుల్లె ప్రశాంత్, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మద్దెలపల్లికి చెందిన చికినారపు సంతోష్ అని తేలిందన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

స్వయం ఉపాధిపై అవగాహన

వాజేడు, జూన్ 11: మండలంలోని ప్రగళ్లపల్లిలో స్వయం ఉపాధిపై గ్రామస్థులకు మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ అవగాహన కల్పించారు. మంగళవారం ఈ కార్యక్రమం జరగ్గా సీడీబీ బ్యాంకు డీజీఎం రామ్మోహన్ హాజరయ్యారు. సోలార్ సిస్టం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వ్యవసాయ రంగం, గృహ అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ డిస్కంలకు విక్రయించి ఆదాయం పొందొచ్చని అన్నారు. సోలార్ సిస్టంను ఏర్పాటు చేయాలనుకున్నవారికి ప్రభుత్వం 30శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బడి గంట మోగిన వేళ

(3వ పేజీ తరువాయి)

సదుపాయాల కల్పన కోసం రూ.6.91 కోట్లను ప్రతిపాదించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 99 ఆశ్రమ పాఠశాలల్లో కూడా పనులు మొద లుపెట్టారు. ఇప్పటి వరకు 256 పాఠశాలలో పనులు పూర్త య్యాయి. మిగతా పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. పాఠశాల లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అసంపూర్తి పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడనున్నారు. ఇప్పటి వరకు ఆయా పాఠశాలలకు 6268 డ్యూయల్ డెస్కులు, 449గ్రీన్ చాక్‌బోర్డులు సరఫరా చేశారు. చాలావరకు పాఠశాలలకు పెయింటింగ్ వేయాల్సి ఉంది.

స్కూల్ డ్రెస్సులు, పుస్తకాలు రెడీ

ఎప్పటిలాగే ఈసారి కూడా విద్యార్థులకు యూనిఫారాలను కుట్టే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. 19,645 మంది విద్యార్థులకు ఒక జత దుస్తులను కుట్టించారు. పాఠశాలల ప్రారంభం రోజు నుంచే పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా 1,71,150 పాఠ్యపుస్తకాల కోసం ప్రభుత్వానికి నివేదించగా ఇప్పటివరకు 1,42,510పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. ఇప్పటికే ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. 95,913 నోటు పుస్తకాలను కూడా ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.

భారీగా ఉపాధ్యాయ ఖాళీలు

జిల్లా వ్యాప్తంగా 192 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా ఎస్‌జీటీ పోస్టులున్నాయి. హిందీ పండిట్-8, తెలుగు పండిట్-8, పీఈటీ -1, ఎస్‌ఏ బయాలజీ -5, ఎస్‌ఏ ఇంగ్లీషు-6, ఎస్‌ఏ హిందీ-3, ఎస్‌ఏ గణితం-4, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్-1, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్-1, ఎస్‌ఏ సోషల్ -10, ఎస్‌ఏ తెలుగు-3, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్-3, ఎస్‌జీటీ 125, ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ 14పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వానికి ప్రతిపాదించగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. అయితే భాషా పండితులు, గణితం, సైన్స్ ఆంగ్ల ఉపాధ్యాయులు అవసరం ఉన్న ఉన్నత పాఠశాలలకు వేర్వేరు మండలాల నుంచి డెప్యూటేషన్ ద్వారా జిల్లా అధికారులు సర్దుబాటు చేస్తున్నారు.

పండగ వాతావరణంలో బడులు తెరవాలి : పాణిని, డీఈవో



నూతన విద్యాసంవత్సర ఆరంభాన్ని ఘనంగా జరపాలి. పండగ వాతావరణంలో పాఠశాలలను తెరిచి అందంగా అలంకరించి విద్యార్థులను ఆహ్వానించాలని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం. అడ్మిషన్ పొందిన విద్యార్థుల ందరికీ మొదటి రోజు నుంచే యూనిఫారాలు అందజేస్తాం. పాఠశాలల ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టాం. పురోగతిలో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తాం. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగేలా విద్యాబోధనను మెరుగుపర్చడంతోపాటు అన్నిమౌలిక సదుపాయాలను కల్పిస్తాం.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మల్హర్, జూన్ 11: మండలంలోని పెద్ద తూండ్ల గ్రామపంచాయతీ పరిధి కిషన్‌రా వుపల్లి వాసి బియ్యని రాములుకు చెందిన ఎద్దు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మంగళవారం ఉదయం గ్రామశివారులోని పొలం గట్లపై మేస్తుండగా కరెంటు తీగలు తగలి షాక్‌కు గురైంది. చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

వరంగల్ సీపీగా రంగనాథ్?

నేడో రేపో ఉత్తర్వులు



వరంగల్ క్రైం, జూన్ 11: వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏ.వి.రంగనాథ్ వస్తున్నట్లు సమాచారం. వరంగల్ రేంజ్ ఇన్‌చార్జి ఐజీగా ఉన్న రంగనాథ్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ నేడో రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కాగా, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బదిలీల్లో భాగంగా వరంగల్ సీపీగా ఉన్న రంగనాథ్ స్థానచలనం చెందారు. రంగనాథ్‌పై బీజేపీ నేతలు సైతం ఫిర్యాదు చేయడంతో తప్పని పరిస్థితిలో బదిలీ చేశారనే ప్రచారం ఉంది. రంగనాథ్ స్థానంలో అంబర్ కిషోర్ ఝాను నియమించడం జరిగింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన సందర్భంగా ప్రభుత్వం పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తుంది. ఇందులో భాగంగా రంగనాథ్ తిరిగి వరంగల్ పోలీస్ కమిషనర్‌గా వస్తున్నారనే ప్రచారం సాగుతోంది. పలువురు రాజకీయ నాయకులు, ఇతర వర్గాలు రంగనాథ్ రాకను స్వాగతిస్తున్నట్లు సమాచారం.

గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 11: గోదావరి వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని గోదావరి వరద ముంపు ప్రాంతాలైన టేకులబోరు, వెంగళరావుపేట, తుర్సవానిగూడెం గ్రామాలను ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఎస్సై పాల్గొన్నారు. గోదావరి వరదల సమయంలో గ్రామస్థులకు ఏర్పడిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున గోదావరి వరదలు వచ్చే అవకాశం ఉందని, వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముంపు గ్రామాలకు చెందిన యువత యూనిఫాం లేని పోలీసులతో సమానమని, వరదల సమయంలో ప్రజలను కాపాడేందుకు శక్తికిమించి కృషి చేయాలని సూచించారు. అనంతరం ముంపునకు గురయ్యే గ్రామాలకు సంబంధించిన వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. వరదల సమయంలో ఎలాంటి సమస్య అయినా గ్రూప్‌లో పెట్టాలని సూచించారు. వరదముంపు ప్రాంతాల ప్రజలకు పోలీసులు అండగా ఉంటారని అన్నారు.

మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఆగం చేస్తావా?

(3వ పేజీ తరువాయి)

రైతులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇటుక బట్టీలకే మట్టిని అమ్మితే చర్యలు తీసుకోవాలని సూచించారు. టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేట బ్రిడ్జి మరమ్మతు పనుల్లో వేగం పెంచాలన్నారు. చిట్యాల మండలం నైన్‌పాక లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్తే ఏం చేస్తున్నారని సంబంధిత అధికారులను నిలదీశారు. విద్యుత్‌శాఖ సమీక్షలో మాట్లాడుతూ నిరంతరాయంగా విద్యుత్‌ను అందించకుండా ఎందుకు కట్ చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై ఎస్ఈ కల్పించుకొని ఏదైనా అత్యవసరమైతే తప్ప కరెంట్ కోతలు విధించడం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో కొత్తగా రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని, మరో నాలుగు నూతన సబ్‌స్టేషన్‌లో మంజూరు దశలో ఉన్నాయని వివరణ ఇచ్చారు.

ఇదే ఆఖరి సమావేశం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఇదే ఆఖరిది కానుంది. వచ్చే నెల 4వ తేదీతో జడ్పీటీసీ, ఎంపీపీల కాల పరిమితి ముగిస్తుంది. ఐదేళ్ల కాలపరిమితిలో రెండేళ్లు కరోనాతో గడిచిపోయాయని, మళ్లీ ఎన్నికలు జరిగేంత వరకు ప్రస్తుతం ఉన్న జడ్పీటీసీ, ఎంపీపీలనే కొనసాగించాలని, ప్రభుత్వ ఆ దిశగా ఆలోచన చేయాలని కోరుతూ సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈవో విజయలక్ష్మి, జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ కళ్లెపు శోభతో పాటు జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



స్వాతి (ఫైల్)

గోవిందరావుపేట, జూన్ 11: మండలంలోని పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూ సింది. స్థానిక ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన అజ్మీరా వినోద్‌కు 11 ఏళ్లక్రితం మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన స్వాతితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కలిగారు. కొన్నిరోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఈక్రమంలో ఈనెల 9న సాయంత్రం భార్యాభర్తలకు గొడవ జరగగా కోపంతో వినోద్ గోవింద రావుపేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకునే సరికి స్వాతి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో వినోద్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. స్వాతి ఆచూకీ తెలిసినవారు 8712670086 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి

వెంకటాపురం(నూగూరు), జూన్ 11: కొమరంభీం కాలనీ ఆదివాసీల సాగులో ఉన్న భూమి దక్కు వరకు అండగా ఉంటామని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గోండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష రెండోరోజు మంగళవారం కొనసాగింది. ఈ శిబిరాన్ని నర్సింహమూర్తి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ కొమరంభీం కాలనీ ఆదివాసీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదని, వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏజెన్సీ ఏరియాలో పెసా చట్టానికి లోబడి భూబదలాయింపు చేయాలని అన్నారు. శిబిరంలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్, కుంజ మహేష్, ఆదివాసీలు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ద్వారా సమస్య విన్నవించిన వృద్ధురాలు

- స్పందించిన ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట, జూన్ 11: తనను కుమారులు సరిగా చూసుకోవడం లేదని ఓ వృద్ధురాలు పోస్టుకార్డు ద్వారా సమస్యను పోలీస్‌స్టేషన్‌లో తెలియపరిచింది. దీంతో స్పందించిన పస్రా ఎస్సై కమలాకర్ మంగళవారం ఆమె ఇంటికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. మండ లంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల నర్సమ్మకు నలుగురు కుమారులు కాగా తనను సరిగా చూసుకోవడంలేదని పోస్టుకార్డు ద్వారా ఆమె పోలీసులకు తెలియపరిచింది. ఈమేరకు ఎస్సై నలుగురు కుమారులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిని మంచిగా చూసుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కన్నాయిగూడెం, జూన్ 11: మండలంలోని ఏటూరు గ్రామం వద్ద ఇసుక ర్యాంపు సమీపంలోని పేకాట స్థావరాలపై ఎస్సై ఎం.సురేష్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. 13 మం దిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు హర్షణీయం

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చి రాములు

టేకుమట్ల, జూన్ 11: కోర్టు కేసు కారణంగా మధ్యలోనే నిలిచిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చి రాములు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భాషా పడింతులను అప్‌గ్రెడ్ చేయడం వల్ల ఎస్జీటీలు ప్రమోషన్ అవ కాశాలు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిపై నివారణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళలకు వైద్య పరీక్షలు

వెంకటాపురం(నూగూరు), జూన్ 11: మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ 95 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో 28 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు.

చెరువుకట్ట మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలి

మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య

వెంకటాపూర్(రామప్ప), జూన్ 11: మండలంలోని కేశవాపూర్ ఊర చెరువుకట్ట మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వర్షాకాలంలో వచ్చిన తీవ్ర వర్షాలకు చెరువుకట్ట తెగిపోయేంత ప్రమాదకర పరిస్థితి నెలకొందని, ఇరిగేషన్ అధికారులు చెరువు ప్రాంతాన్ని పరిశీలించి నివేదిక తయారు చేశారని తెలిపారు. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైందని, ఇప్పటి వరకు చెరువుకట్టకు ఎలాంటి మరమ్మతులు చేయకపోవడం నీటిపారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అధికారులు అలసత్వం చేయడం వల్ల వందలాది ఎకరాల పంట భూముల్లో రైతులు పంటలు పండించుకునే పరిస్థితుల్లో లేరని, తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.. సకాలంలో నివేదికలు ప్రభుత్వానికి అందించకుండా నిధులు మంజూరు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.

ఇప్పటికైనా మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందించి కేశవాపూర్ ఊరచెరువు కట్ట మరమ్మతుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఆయన కోరారు.